ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
05-01-2025
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 115 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ చేసింది. రీజనల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలన్నారు. ఆర్బిట్రేటర్లుగా ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లు రైతులకు వీలైనంత ఎక్కువ మొత్తం పరిహారం వచ్చేలా చూడాలన్నారు. ఆర్ఆర్ఆర్ జాతీయ రహదారుల భూ సేకరణ, పరిహారం, హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణం, రేడియల్ రోడ్ల నిర్మాణాలపై రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

# ప్రయోజనాలను రైతులకు వివరించి భూ సేకరణ

...మిగతాది 2 లో

'భూ సేకరణకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించాలి, తరచూ రైతులతో సైతం సమావేశమై ఆయా రహదారుల నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో భూ సేకరణ వేగవంతం చేయవచ్చు. ఆర్ఆర్ఆర్ (దక్షిణ భాగం)కు ఎన్‌హెచ్ఏఐ ప్రాథమికంగా ఆమోదం తెలిపింది కనుక హెచ్ఎండీఏతో అలైన్‌మెంట్ చేయించాలి. హైదరాబాద్ ను కలిపే 11 రహదారులకు ఆటంకం లేకుండా రేడియల్ రోడ్లు నిర్మించాలి. ఈ రోడ్లకు సంబంధించి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలం కావడంతో పాటు ఔటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ అనుసంధానంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని' సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు.

## దివి నుంచి దిగిన సునీతా విలియమ్స్

- 5 నెలల తర్వాత ఎట్టకేలకు



**జయభేరి, న్యూయార్క్, జనవరి 4:**

అంతరిక్షం అనేది రహస్యాలతో నిండిన మన విశ్వంలో ఒక భాగం. కొన్ని రహస్యాలను మానవులు ఛేదించారు. అయితే చాలా రహస్యాలు పజిల్‌లుగా మిగిలిపోయాయి. ఈ పజిల్స్ పరిష్కరించడానికి, శాస్త్రవేత్తలు నిరంతరం మానవులను అంతరిక్షంలోకి పంపుతున్నారు. సుమారు 5 నెలలుగా అంతరిక్షంలో చిక్కుకున్న వారిలో భారతీయ ...మిగతాది 2 లో

## తమది ప్రజా ప్రభుత్వమని స్పష్టీకరణ


- ఇచ్చిన హామీలే కాకుండా హామీ ఇవ్వనివి కూడా అమలు చేస్తున్నామని వెల్లడి
- జగన్ గాలిలో కాకుండా రోడ్లపైకి వచ్చి మేం చేసిన మంచిని చూడాలి.. నారా లోకేశ్
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎవరూ అడగకుండానే అమలు చేస్తున్నామని వివరణ



**జయభేరి, విజయవాడ :**

విజయవాడ పాయకాపురం జూనియర్ కళాశాలలో ఇవాళ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన అనంతరం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను పద్ధతి ప్రకారం ...మిగతాది 2 లో

## దేవుడిచ్చిన 11..



**జయభేరి, కడప, జనవరి 4:**

మాజీ సీఎం జగన్ కు 11 సెగ మాత్రం ఇప్పుడిప్పుడే వదిలేలా లేదు. ఏపీలో ఎన్నికలు ముగిసి 7 నెలలు కావస్తున్నా, 11 నెంబర్ మాత్రం వైసీపీని వదలట్లేదు. సోషల్ మీడియాలో 11 నెంబర్ కు ఒక క్రేజ్ తెచ్చేలా మీమ్స్ కూడ వైరల్ గా మారాయి. ఆ మీమ్స్ ఓ రేంజ్ లో ఉండడంతో వైసీపీకి పెద్ద తలనొప్పులు తెస్తున్నాయని చెప్పవచ్చు. ఇటీవల ఓ కారుకు గల నెంబర్ తో ట్రోలర్స్ విపరీతంగా ట్రోలింగ్ చేస్తుండడం విశేషం.ఏపీలో ఎన్నికల ఫలితాలు కూటమి, వైసీపీ పార్టీలకు పెద్ద షాక్ ఇచ్చాయి. కూటమికి ఊహించని రీతిలో 164 సీట్లు రాగా, వైసీపీకి 11 సీట్లు దక్కాయి. ...మిగతాది 2 లో

## డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు



2 లో

## హెల్మెట్ వినియోగం తప్పనిసరి



4 లో



## నెంబర్ 2 పొంగులేటేనా..?

**జయభేరి, ఖమ్మం, జనవరి 4:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో పొంగులేటి శ్రీనివాసులురెడ్డికి ఇస్తున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చినా ఆయన మిగిలిన నేతలను మించిపోయారు. .పొంగులేటి శ్రీనివాసులురెడ్డి తెలంగాణ కేబినెట్ లో కీలకమైన మంత్రిగా చెబుతారు. ఒకరకంగా చెప్పాలంటే మల్లు భట్టి విక్రమార్క తర్వాత పొంగులేటికే పార్టీ హైకమాండ్ కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానీ ప్రయారిటీ ఇస్తారంటారు. అందుకు అనేక కారణాలున్నాయంటున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనరసింహ, శ్రీధర్ బాబు వంటి వారికంటే పొంగులేటి ఒక అడుగు ముందే ఉన్నారన్నది కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.పొంగులేటి శ్రీనివాసులురెడ్డి తొలుత వైసీపీలో ఉన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అత్యంత సన్నిహితులు. ప్రముఖ పారిశ్రామికవేత్త. ఆర్థికంగానే కాదు సామాజికవర్గంగా కూడా బలమైన నేత. ఆయన 2014లో వైసీపీ నుంచి ఖమ్మం ...మిగతాది 2 లో

## ప్రజలకు అందుబాటులో మల్లాపూర్ థీమ్ పార్క్

3 లో

## కన్ఫ్యూజన్ లో గులాబీ కేడర్

**జయభేరి, హైదరాబాద్, జనవరి 4:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారా? పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా? పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది? సీఎం రేసు కోసం కేటీఆర్కవిత పోటీ పడుతున్నారా? ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది.అధికారం పోయిన తర్వాత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్. నేతల వలసలు కాసేపు పక్కన బెడితే.. వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు.ఇక అసలు విషయానికొద్దాం..పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, రెండు వారాల కిందట ఫ్యామిలీ సభ్యులతో కేసీఆర్ సమావేశమయ్యార. ...మిగతాది 2 లో




## ఒకరికి ఒకరు.. కొనసాగుతున్న స్నేహబంధం



**జయభేరి, కాకినాడ, జనవరి 4:**

ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలకు ముందు అనేక ఊహాగానాలు వినిపించాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలవబోరని దాదాపు చాలా మంది అంచనా వేశారు. బీజేపీ ఏదో ఒకటి చేసి కూటమి ఏర్పాటు కాకుండా చూసుకుంటుందన్నభరోసాలో దిలాసాగా వైసీపీ నేతలు కూడా ఉన్నారు.చివరకు పట్టుబట్టి సాధించి మరీ కూటమిని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ఏర్పాటు తర్వాత కూడా దీనిపై అనేక రకాలుగా ప్రచారం సాగింది. అభ్యర్థుల ఎంపికలోనూ, సీట్ల కేటాయింపుల్లోనూ విభేదాలు తలెత్తుతాయని భావించారు.కానీ ఎన్నికలకు చాలా కంఫర్ట్ గా మూడు పార్టీలు కలిసి వెళ్లడంతో ఆశలు పెట్టుకున్నవాళ్లంతా అవాక్కయ్యారు. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈరకమైన ప్రచారం ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రయోజనాలను రైతులకు వివరించి

మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం మీదుగా సాగే నాగ్‌పూర్ విజయవాడ (NH 163G) రహదారి, ఆర్మూర్ జగిత్యాల మంచిర్యాల రహదారి (NH 63), జగిత్యాల నుంచి కరీంనగర్ (NH 563) రహదారుల నిర్మాణంతో పాటు వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి భూ సేకరణ, అటవీ అనుమతుల్లో అడ్డంకుల తొలగింపునకు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ రహదారుల నిర్మాణంలో అటవీ శాఖ ఎందుకు కొర్రీలు పెడుతోందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డోబ్రియల్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తాం, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆర్ అండ్ బీ, అటవీ శాఖ నుంచి ఈ సమస్యల పరిష్కారానికి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారితో 10 రోజులకోసారి సమీక్షించి త్వరగా క్లియరెన్స్ వచ్చేలా చూడాలన్నారు. ఇక్కడ కాకపోతే సంబంధిత శాఖల మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులు, అధికారులతో సమావేశమై అనుమతులు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అండర్ పాస్‌ల నిర్మాణాన్ని విస్మరిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆ సమస్య ఎదురుకాకుండా నిర్మాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ ఆదేశించారు. రైతులు కిలోమీటర్ల మేర వెళ్లి తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. హ్యామ్ విధానంలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 12 వేల కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 17,700 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలి. ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి పాత జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలి. ఇందుకు సంబంధించి కన్సల్టెన్సీల నియామకం, డీపీఆర్ ల తయారీతో రహదారుల నిర్మాణంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 3 సంవత్సరాలలో రహదారుల నిర్మాణం పూర్తికావాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టాలి, కూలిన వంతెలను వెంటనే నిర్మించాలని ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు వెంటనే విడుదల చేసి, కేంద్రం నుంచి రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను పొందాలని ఆర్థిక శాఖ అధికారులకు రేవంత్ సూచించారు.రాష్ట్రంలో గ్రామ పంచాయతీలతో సహా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాలని.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండేలా డిజైన్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకు సంబంధించి విడతల వారీగా నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. ఇకపై రాష్ట్రంలో ఏ గ్రామానికి రోడ్డు లేదు అనే మాట తనకు వినపడొద్దని అధికారులతో అన్నారు.

## నెంబర్ 2 పొంగులేటేనా..?

పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఆయన వైసీపీకి కొంత కాలం టీవైసీపీ అధ్యక్షుడిగా పనిచేసినా తర్వాత పార్టీకి రాజీనామా చేసి అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. అయితే బీఆర్ఎస్ పార్టీలో ఆయనకు అంత ప్రాధాన్యత లభించలేదు. అక్కడ పువ్వాడ అజయ్ కు ఇచ్చిన ప్రాధాన్యత బీఆర్ఎస్ హైకమాండ్ పొంగులేటికి ఇవ్వలేదు. 2019 ఎన్నికల్లోనూ ఆయనకు ఖమ్మం పార్లమెంటు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆయనతో పాటు మరో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా చేరారు కేబినెట్ లో ప్రధానమైన శాఖను కూడా పొంగులేటి శ్రీనివాసులురెడ్డికి కేటాయించారు. రెవెన్యూ శాఖతో పాటు కీలకమైన సమాచారశాఖను కూడాపొంగులేటికి రేవంత్ రెడ్డి కట్టబెట్టారు. అంటే ఆయనపై ఎంత నమ్మకం ఉంచారో ఇలాగే అర్థం అవుతుంది. ఇక ముఖ్యమైన మంత్రి వర్గ ఉప సంఘాల్లో కూడా ఆయనను సభ్యుడిగా నియమించారు. ఏదైనా బహిరంగ సభ నిర్వహణ బాధ్యతను కూడా రేవంత్ రెడ్డి పొంగులేటికి అప్పగిస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకు కారణాలు ఆర్థికంగా పార్టీకి ఖర్చు చేయడమే కాకుండా ప్రభుత్వ పరంగా కూడా పొంగులేటి ఎటువంటి నిబంధనలకు అతిక్రమించకుండా ఉంటారని కీలకమైన బాధ్యతలను ఆయనకు అప్పగించారంటున్నారు. అయితే ఇక్కడ మంత్రులలో తమకు దక్కని ప్రాధాన్యత పొంగులేటికి దక్కుతుండటంపై మిగిలిన మంత్రుల్లో ఒకింత అసహనం, అసంతృప్తి వ్యక్తమవుతున్నా బయటపడటం లేదు. ఐదేళ్ల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేయడంతో ఢిల్లీలో ఆయన లాబీయింగ్ చేయగలడన్న నమ్మకం రేవంత్ లో ఉందని చెబుతున్నారు. నిజానికి పొంగులేటి లేట్ గా జాయిన్ అయి... లేటెస్ట్ గా పాతుకు పోయాయంటున్నాయి పార్టీ వర్గాలు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నప్పటికీ తుమ్మల నాగేశ్వరరావుతో రేవంత్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ నుంచి పరిచయాలున్నప్పటికీ పొంగులేటికే ఫస్ట్ ప్రయారిటీ అంటున్నారు. అందుకే కాంగ్రెస్ కింది స్థాయి నేతలు కూడా ఏదైనా పదవి కావాలనుకుంటే పొంగులేటి చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారట. ఇంకా ఒకటుంది. తెలంగాణ కాంగ్రెస్ లో పొంగులేటి నెంబరు 2గా చెలామణి అవుతున్నారన్న వారున్నా అందులో వాస్తవం లేదంటున్నారు మరికొందరు.

## కన్ఫ్యూజన్ లో గులాబీ కేడర్

దీనికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మరో ముగ్గురు కీలక నేతలు హజరయ్యారు. అనారోగ్యం, వయో భారం కారణంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఆలోచన బయటపెట్టారట. పార్టీకి కావాల్సిన సలహాలు మాత్రం ఇస్తానని, మీ ముగ్గురు పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని చెప్పారట పెద్దాయన. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా తాను కొద్దిరోజులు కంటిన్యూ అవుతానని అన్నారట. వీలు కుదిరినప్పుడు అసెంబ్లీకి వచ్చి వెళ్తానని, సమావేశాలు సైతం మీరే చూసుకోవాలని తెలిపారట. అయితే పార్టీలో ఎవరికి ఏయే పదవులు అన్నదానిపై నోరు ఎత్తలేదని తెలుస్తోంది.ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన కేటీఆర్, ప్రస్తుతం కేసీఆర్ రెస్టు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాదు పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. దీంతో అధ్యక్షుడు పోటీకి కేటీఆర్‌కవిత మధ్య పోటీ నెలకొందని తెలుస్తోంది.కార్యకర్తలతో సమావేశం పెట్టినప్పుడల్లా హార్డ్ కోర్ అభిమానులు మాత్రం కేటీఆర్ సీఎం.. కవిత సీఎం స్లోగన్ చేయడం కూడా అధిపత్యం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నట్లు చెబుతున్నారు పార్టీ నేతలు. జరుగుతున్న పరిణామా లను గమనించిన కారు పార్టీ కార్యకర్తలు కాసింత డైలామాలో పడిపోయారు. రేపోమాపో స్థానిక ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ముందు ఈ తరహా కన్ఫ్యూజన్ కరెక్ట్ కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల కేడర్ చెదిరిపోయే పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు.పార్టీ వ్యవహారాలు కేటీఆర్‌కవిత చుట్టూ తిరగడంతో హరీష్‌రావు మద్దతుదారులు ఆసక్తి గమనిస్తున్నారు. పార్టీలో ఇంత జరుగుతున్నా, తమ అభిమాన నేత నోరు మెదప పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దీనిపై అప్పుడే పార్టీలో చిన్నపాటి చర్చ మొదలైపోయిందిఒకప్పుడు రూరల్‌గా బలంగా ఉండేది కారు పార్టీ. మొన్నటి ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. ఈ క్రమంలో పార్టీలో అంతర్గత వ్యవహారాలు కేడర్‌తోపాటు నేతలకు మింగుడుపడడం లేదు. ఈ వ్యవహారం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వెయిట్ అండ్ సీ.

## తమది ప్రజా ప్రభుత్వమని స్పష్టీకరణ

నెరవేరస్తున్నామని స్పష్టం చేశారు. హామీ ఇవ్వని పథకాలను కూడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఎవరూ అడగకుండానే ఇంటర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గౌరవ పులివెందుల ఎమ్మెల్యే గారు గాలిలో కాకుండా రోడ్డుపైకి వచ్చి తాము చేస్తున్న మంచి పనులను చూడవచ్చని లోకేశ్ పేర్కొన్నారు. జగన్ ప్రజల్లోకి వచ్చి సమస్యలు తెలుసుకోవడంలో తప్పులేదు. ఇప్పుడు రోడ్లు కూడా మంచివి వేశాం, ఆయన నిర్భయంగా రోడ్లపైకి రావచ్చు. ఇంకా మేం చేయాల్సి చాలా ఉంది, అన్నీ చేస్తాం. జగన్ వచ్చి మేం అమలుచేస్తున్న మంచి కార్యక్రమాలు చూడాలని కోరుతున్నాం. రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి మాది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కాదు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రజాదర్బార్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నాం. గత ప్రభుత్వ తప్పుల వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుంది. 4 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా 4 వేల పెన్షన్ అందజేస్తున్నాం. గత ప్రభుత్వం మూసివేసిన అన్నక్యాంటీన్లు తెరిచాం. ఉచిత గ్యాస్ పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నాం అని వివరించారు.

# డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు

**అమెరికాలో 1958లో కేవలం 12,000 మంది మాత్రమే ప్రవాస భారతీయులు ఉండేవారు. రానురాను వారి ప్రాముఖ్యత పెరిగి ఇప్పుడు అమెరికా మొత్తం జనాభాలో 1.5% వరకు ప్రవాస భారతీయులు ఉనికిని పొందడం విశేషం. సిఇఒలుగా, సైంటిస్టులుగా, ఆస్ట్రోనాట్లుగా, విధానపర నిర్ణేతలుగా, చట్టసభ సభ్యులుగా ఇలా అనేక రంగాల్లో ప్రవాస భారతీయులు విస్తరిస్తుండటంతో అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న అపోహలు మొదలవుతున్నాయి. ఇది చివరకు హెచ్1బి వీసాలపై ప్రభావం చూపిస్తోంది.**




మేక్ ఎగైన్ గ్రేట్ అమెరికా 'మాగా' నినాదంతో రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు హెచ్1బి వీసాల వివాదం అగ్నిపరీక్షగా మారింది. ప్రవాసీయుడైన ఎలాన్ మస్క్‌కు పెద్దపీట వేయడం వివాదాస్పదమవుతోంది.ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) అన్న ట్రంప్ ప్రధాన నినాదానికి తూట్లు పొడుస్తోంది. న్యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డిఒజిఇ) అధినేతగా ఎలాన్‌మస్క్, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్‌పటేల్, పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె థిల్లాన్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా డాక్టర్ జయభట్టాచార్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్‌తో పాటు వివేక్ రామస్వామి వంటి భారతీయ మూలాలున్న ఆరుగురిని ట్రంప్ తన యంత్రాంగంలో కీలక స్థానాల్లో నియమించారు. ఇది 'మాగా' నినాదానికి విరుద్ధమని వలసవాద, ఇస్లామిక్ వ్యతిరేక ఉద్యమ నేత లారా లూమెర్ ధ్వజమెత్తుతున్నారు.ట్రంప్ నియమించిన వారిలో శ్రీరామ్ క్రిష్ణన్ చెన్నైకు చెందినవారు. ఇండియా ఫస్ట్ అన్న నినాదానికి ఆయన కట్టుబడి ఉన్నారని, ఇది 'అమెరికా ఫస్ట్ అన్న లక్ష్యానికి వ్యతిరేకమని లారా లూమెర్ ఆగ్రహిస్తున్నారు. అయితే హెచ్1బి వీసాల్లో 70% భారతీయు లే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులని లూమెర్ ఆరోపిస్తున్నారు. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకోవడంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్య ప్రమాణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించుకోవలసి వస్తోందని నిలదీస్తున్నారు. ఈ వాదాన్ని వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్ తదితరులు తిప్పికొడుతున్నారు.వాస్తవానికి ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు హెచ్1బి వీసా పైనే వచ్చారు.విదేశీ ప్రతిభతో అమెరికా ప్రయోజనం పొందుతుంది తప్ప అమెరికా వాసుల ప్రయోజనాలకు, హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని మస్క్, రామస్వామి తమ వాదన వినిపిస్తున్నారు. చేతిలోపైసా లేకుండా అమెరికాకు వలస వచ్చిన గొప్ప ఇంజినీర్ నికోలా టెస్లా స్ఫూర్తితోనే తన కారుకు టెస్లా అని పేరు పెట్టినట్టు మస్క్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికాలో విద్యుత్ విప్లవానికి నికోలా టెస్లా మూలకారకుడని మస్క్ ఉదహరించారు. అమెరికాకు సమర్థత కలిగిన ప్రజలు కావాలని తానెల్లప్పుడూ భావిస్తానని, తెలివైన వారు మన దేశానికి రావాలని, ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అమెరికాలో ఉద్యోగాలు రాబోతున్నాయని కొత్త సంవత్సరం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బి వీసా ఉపయోగపడుతుందని మస్క్, వివేక్ రామస్వామి కూడా పేర్కొంటున్నారు.ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలికగా నియమించుకోడానికి అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం నిబంధనల్లో మార్పులు చేసింది. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది. 2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు.

ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. 2020లో అమెరికాలోని సంస్థలు విదేశాల నుంచి ఉద్యోగులు, కార్మికులను తెచ్చుకునే విధానానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిలకడ లేని విధానాలతో మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు హెచ్1బి వీసా అసలు ప్రయోజనాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ సమస్యను ట్రంప్ ఈసారి ఎలా పరిష్కరిస్తారో చూడాలి. హెచ్1బి వీసాలపై ఆంక్షలు ఎక్కువ చేస్తే అమెరికా కంపెనీలు విదేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి దేశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనా యంత్రాంగంలో 'మాగా' గ్రూపు ఆలోచనలను మార్చడానికి భారత ప్రభుత్వం గట్టిగానే పని చేయవలసి వస్తుంది. భారత్‌కు ఆదాయం తెచ్చిపెట్టే దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. గత ఏడాది 120 బిలియన్ డాలర్ల వరకు భారత్‌కు అమెరికా నుంచి ఆదాయం సమకూరింది. ఈ ఆదాయ స్రవంతిని భారత్ దొరకబుచ్చుకోగలగాలి. అలాగే అమెరికాను ఆకర్షించడానికి సాంకేతిక నైపుణ్యంలో టాప్‌లో భారతీయులు ఉన్నప్పుడే ఎలాంటి చిక్కులు వీసాల్లో ఎదురుకావు.

## ఒకరికి ఒకరు..

ఆగలేదు. మంత్రి వర్గం ఏర్పాటు దగ్గర నుంచి మొదలయిన ఈ ప్రచారం ఇంకా సాగుతూనే ఉంది. అసంతృప్తులు బయలుదేరుతాయని ఎవరికి వారు ప్రత్యర్థులు అంచనా వేసుకున్నారు. కానీ అంతా సాదాసాదీగా, సాఫీగా జరిగిపోయింది. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ సమయంలోనూ అనేక వదంతులు షికార్లు చేశాయి. నామినేటెడ్ పోస్టుల కోసం ఇటు జనసేన, అటు బీజేపీ పట్టు బడుతుందన్న ఊహాగానాలు చెలరేగగా అవి ఊహలకే పవన్, చంద్రబాబులు పరిమితం చేశారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఎలాంటి అసంతృప్తులు రాలేదు. ఒకవేళ పార్టీ నేతల్లో ఉన్న ఇంకా అనేక పదవులు వచ్చేవి ఉండటంతో మౌనంగా ఉన్నారన్నా అనుకోవాలి. కానీ ఇక్కడ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి... అగ్రనేతలు అందరూ కలసి కట్టుగానే ఈ ఏడు నెలల నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. ఎక్కడా కొద్దిగా కూడా పొరపొచ్చాలు రాలేదు. అనేక నిర్ణయాలు తీసుకున్నా ఇటు పవన్ కల్యాణ్ నుంచి కూడా పెద్దగా వ్యతిరేక వ్యాఖ్యలు వెలువడలేదు. ఒకహోంశాఖపైనే ఆయన నేరుగా కామెంట్ చేయడం కొంత కలకలం రేపింది. ఎందుకంటే హోంశాఖను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తుండటంతో తేడా కొట్టిందన్న కామెంట్స్ వినపడ్డాయి. కానీ చంద్రబాబు వెంటనే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టి తామిద్దరమూ ఒక్కటేనన్న సంకేతాలను ఇటు పార్టీ నేతలకు, అటు ప్రత్యర్థులకు బలంగా పంపగలిగారు. ఇద్దరూ ఇప్పటి వరకూ ఏ అంశంపైనా విభేదించుకున్న దాఖలాలు లేవు. ఇకముందు కూడా ఉండవన్న ధీమా ఆ పార్టీల క్యాడర్ లో కనపడుతుంది. ఎందుకంటే పవన్ అడిగింది చంద్రబాబు కాదనడం లేదు.. అలాగే చంద్రబాబు చెప్పినదానికి పవన్ కల్యాణ్ ఓకే అని చెబుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. పట్టు విడుపులతో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. రాజకీయంగా జగన్ ను ఎదుర్కొనాలంటే కలసి ప్రయాణంచేయడం ఒక్కటేనన్న అభిప్రాయానికి ఇద్దరు నేతలు వచ్చారు. అందుకే ఎవరేమి అన్నా, ఏ విషయంలోనైనా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైగా పవన్ కల్యాణ్ ఏకంగా పదేళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని ఆకాంక్షించారంటే ఆయన ఏ రేంజ్ లో చంద్రబాబు అంటే గౌరవమో చెప్పకనే తెలుస్తోంది. సో.. ఇద్దరూ విడిపోతారన్న ఆశలు ఎవరు పెట్టుకున్నా అవి అడియాసలు కాక తప్పవు బ్రదరూ.

## దేవుడిచ్చిన 11..

ఫలితాలు విడుదలైన సమయం కాస్త ట్రోలింగ్ అంతగా లేదని చెప్పవచ్చు. రాను రాను 11 నెంబర్ పై మాత్రం పరోక్షంగా ట్రోలర్స్ తమ సత్తా చాటుతూ, సోషల్ మీడియాను ఒక ఊపు ఊపేస్తున్నారు. కూటమికి వచ్చిన 164 నెంబర్ ని కూడితే 11 వస్తుంది. అదే వైసీపీకి దక్కిందని కొందరు విపరీతంగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం సాగించారు.అంతేకాదు జబర్దస్త్ లాంటి కామెడీ షోలలో కూడ హైపర్ ఆది వంటి కమెడియన్స్ తమ స్కిట్ లలో 11 గురించి ప్రస్తావించి నవ్వులు పూయించారు. ఇలా ఏపీలో 11 నెంబర్ అంటేనే వైసీపీ గుర్తొచ్చేలా సోషల్ మీడియా పరోక్షంగా కోడై కూస్తోంది. ఇది ఇలా ఉంటే తాజాగా ఉండి ఎమ్మెల్యే త్రిబుల్ ఆర్ (రఘురామ కృష్ణంరాజు) వాహనం నెంబర్ ను ఉద్దేశించి, 11 నెంబర్ మరోమారు తెరపైకి వచ్చింది. సోషల్ మీడియాలో ఈ కారు నెంబర్ ఇప్పుడు ట్రెండింగ్ లో ఉంది. అందుకు ప్రధాన కారణం ఆ కారు నెంబర్ ఏపీ 11 ఏపీ 1111 కావడమే.ఏపీ డిప్యూటీ స్పీకర్ హోదాలో గల ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు చెందిన కారుగా ఇది ప్రచారం సాగుతోంది. కాగా పదేళ్ల క్రితం త్రిబుల్ ఆర్ ఈ కారు నెంబర్ ను పొందినట్లు సమాచారం. యాదృచ్ఛికంగా ఆ కారు నెంబర్ లో అన్నీ 11 లు ఉండడంతో, రాజు గారూ.. మీరు సూపర్ టీడీపీ కార్యకర్తలు కామెంట్స్ చేస్తున్నారు. వైసీపీకి కేవలం 11 సీట్లు దక్కినా, రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదని, ఇలా ట్రోలింగ్ చేయడం కూడ సబబు కాదని పలువురి అభిప్రాయం. ఏదిఏమైనా వైసీపీకి 11 నెంబర్ సెగ మాత్రం ఇప్పుడిప్పుడే వదిలేలా లేదని చెప్పవచ్చు.

## దివి నుంచి దిగిన సునీతా విలియమ్స్

సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ కూడా ఒకరు. సునీతా విలియమ్‌స్‌ను తిరిగి తీసుకురావడానికి నాసా నిరంతరం ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరిమార్చి నాటికి వారు తిరిగి వచ్చే అవకాశం ఉంది. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన తర్వాత సునీతా విలియమ్స్, ఆమె భాగస్వామి బుచ్ విల్మోర్ శారీరకంగా ఫిట్‌గా తయారవుతారు.. కాకపోతే ఎన్ని రోజులు పడుతుందనేది మాత్రం పెద్ద ప్రశ్న. ఎందుకంటే అంతరిక్షం నుంచి తిరిగొచ్చే వ్యోమగాముల్లో శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు సంభవిస్తాయి. నెలల తరబడి వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నారు.2022 సంవత్సరం ప్రారంభంలో ఫ్రాంటియర్ న్యూరల్ సర్క్యూట్‌లలో ఒక అధ్యయనం ప్రచురించబడింది. దీని టాపిక్ 'బ్రెయిన్స్ ఇన్ స్పేస్‌ఎఫెక్ట్ ఆఫ్ స్పేస్ లైట్ ఆన్ హ్యూమన్ బ్రెయిన్'లో పేర్కొన్నారు. 6 నెలలకు పైగా అంతరిక్షంలో గడిపి తిరిగి వచ్చిన 12 మంది వ్యోమగాములపై ఈ అధ్యయనం జరిగింది. ఈ అధ్యయనంలో అంతరిక్షం నుంచి తిరిగొచ్చే వ్యోమగాముల మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై పరిశోధనలు జరిగాయి. అంతరిక్షంలో రేడియేషన్‌ను నివారించడానికి, మెదడు భిన్నంగా పనిచేయడం ప్రారంభిస్తుందని పేర్కొంది. చాలా కాలం గడిపిన తర్వాత తిరిగి వచ్చే వ్యోమగాములు మాట్లాడటం, నడవడం, ప్రజలను కలవడంలో కూడా సమస్యలను ఎదుర్కొంటారని అధ్యయనంలో చెప్పబడింది. వారి కళ్లు కూడా బలహీనమవుతాయి. అంతరిక్ష యాత్ర నుండి తిరిగి వచ్చిన అమెరికన్ వ్యోమగామి డొనాల్డ్ పెటిట్, అతను తన కళ్లు మూసుకున్న వెంటనే దేవకన్యలు, గ్రహాంతరవాసులను చూస్తానని చెప్పాడు. చాలా మంది వ్యోమగాములు ఇలాంటి ఫిర్యాదులు చేశారు.వ్యోమగామి అంతరిక్షంలో ఉన్నప్పుడు, గురుత్వాకర్షణ అదృశ్యమవుతుంది, దీని కారణంగా శరీరం మొత్తం బరువు కూడా తగ్గిపోతున్న అనుభవాన్ని పొందుతారు. వారి మెదడు శరీరాన్ని నియంత్రించడానికి వివిధ మార్గాల్లో పనిచేస్తుంది. గురుత్వాకర్షణ శక్తికి దూరంగా ఉన్నప్పుడు మనిషి ఎముకల బరువు చాలా వేగంగా తగ్గుముఖం పడుతుందని అంతరిక్ష సంస్థ నాసా తెలిపింది. వ్యోమగాములు కూడా అంతరిక్ష రక్తహీనతకు గురవుతారు. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన 14 మంది వ్యోమగాముల శరీరంలోని 54 శాతం ఎర్ర రక్తకణాలు నాశనమయ్యాయని ఒక అధ్యయనంలో తేలింది.



## అర్హులైన ప్రతి రైతుకు 2 లక్షల రుణమాఫీ చేశాం

- గత ప్రభుత్వాలు ఎప్పుడూ చేయలేదు.
- కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో పదవులు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**జయభేరి, భువనగిరి:**

నల్గొండ జిల్లా, శాలి గౌరారం వ్యవసాయ మార్కెట్ నూతన పాలక వర్గం ప్రమాణ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత పది ఏళ్ల పాలనను,సంవత్సరం ప్రజాపాలనను పోల్చే చూసుకోవాలని కార్యకర్తలకు తెలిపారు. మిగులు బడ్జెట్ తో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన 7 లక్షలు అప్పు చేశారు. చిత్తశుద్ధితో పాలన చేసి,సరైన పద్ధతిలో ఖర్చు పెట్టింటే బంగారు తెలంగాణ సాధ్యం అయేది. నిరుద్యోగ సమస్యల ఉండేది కాదు. చేసిన అభివృద్ధి పనులను మనం విస్తృతంగా ప్రచారం చేయాలి. మరో 90 రోజులలో స్థానిక ఎన్నికలు జరుగతాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని కార్యకర్తలకు నాయకులకు సూచించారు. మనస్పర్థలు లేకుండా కష్టపడి సమన్వయ గా పనిచేయాలి. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఈ రోజు నియోజకవర్గం లో తిరిగే పరిస్థితి లేదు. నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహ PACS చైర్మన్ మురళి, డైరెక్టర్లు స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో మల్లాపూర్ థీమ్ పార్క్

■ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే BLR - కార్పొరేటర్ పన్నాల

**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలో సుమారు నాలుగు కోట్ల రూపాయలతో అత్యాధునిక హంగులతో, ఆహ్లాదమైన థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి పండుగ తరువాత థీమ్ పార్కును ప్రారంభించుకుందామని తెలిపారు, నియోజకవర్గంలో అత్యంత సుందరంగా తయారవుతున్న థీమ్ పార్క్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో GHMC ఇంజినీరింగ్ అధికారి AE శ్రవంతి, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, పైళ్ల ప్రవీణ్, పద్మరెడ్డి, దయాకర్ రెడ్డి, బుసాని రఘు, ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ రావు, శీలం ప్రవీణ్, రఘు పాల్గొన్నారు.









బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెస్ట్ బీమ్ రెడ్డి నగర్ కాలనీ హనుమాన్ టెంపుల్ దగ్గర నూతనముగా వేస్తున్న సిసి రోడ్లను పరిశీలిస్తున్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతలో రాజీ లేకుండా ఎటువంటి అలసత్వం జరగకుండా రోడ్లు వేయాలని కాంట్రాక్టరకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**



శనివారం పోచారం మున్సిపల్ పరిధిలోని ప్రతాప సింగారంలో మార్నింగ్ వాక్ లో భాగంగా బ్రిడ్జి వద్ద గుంతలు పడ్డ రోడ్డును మాజీ ఎమ్మెల్యే మాలిపెద్దీ సుదీర్ రెడ్డితో కలిసి శనివారం పరిశీలించరు. మరమత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమము లో మున్సిపల్ ఏఈ మహిపాల్ శానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బల్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఘట్కేసర్**

## గ్రేవీ యార్డ్ కోసం నిదులు మంజూరు



**ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న ముస్లిం గ్రేవీయర్డ్ కొరకు మరియు హిందువుల స్మశానవాటిక కోసం అభివృద్ధి కోసం ప్రత్యేక ననిధులు కేటాయిస్తుమని తెలిపిన ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్పర్సన్ పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ముస్లిం ల గ్రేవీ యార్డ్ పూర్తి మట్టిని పోయించడం కోసం అదనంగా నిదులు మంజూరు చేస్తామని తెలిపారు. అదేవిధంగా గతంలో హిందువుల స్మశాన వాటిక అభివృద్ధి కోసం, అదేవిధంగా ముస్లింల గ్రేవీయర్డ్ అభివృద్ధి కోసం నిదులు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందు పట్ల వెంకట్ రెడ్డి, మొయినార్టీ అధ్యక్షుడు ఫరూక్, మొయినార్టీ మాజీ అధ్యక్షుడు కుతుబ్, నాయకులు అన్ను, నజీర్, నబీ, కాలీళ్, అస్లాం, షకీల్, గఫ్ఫార్, శనవాజ్, హస్సన్, జహంగీర్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన కాంగ్రెస్ నేతలు

■ కలెక్టర్ను సన్మానిస్తున్న పీసీసీ అధికార ప్రతినిది బండారు శ్రీకాంత్ రావు తదితరులు



**జయభేరి, గజ్వేల్, జనవరి 04 :**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరిని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో పి సిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, పీసీసీ కార్యదర్శి నాయినియాదగిరి, గజ్వేల్, ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లు మద్దూరి మల్లారెడ్డి, శ్రీనివాస్ గుప్తా, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జి ల్లా అధ్యక్షులు విజయకుమార్ తదితరులు మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పూలమొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## మేడ్చల్ లో ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు జన్మదిన వేడుకలు



**జయభేరి, జనవరి 4:**

మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలను మేడ్చల్ లో ఘనంగా నిర్వహించారు. ఎక్స్ పర్ట్ గార్డింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రదీప్ సింగ్, మాజి ఎంపిపి పద్మ జగన్ రెడ్డి ల ఆధ్వర్యంలో శంభిపూర్ రాజు జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన మైనార్టీ నాయకులు మహ్మద్ యూసుఫ్

■ మెట్రో రైలు సేవలు పొడగించడం పట్ల సీఎం కు ధన్యవాదాలు

**జయభేరి, జనవరి 4:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మూడు చింతలపల్లి మండలం, కేశవరం గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు మహ్మద్ యూసుఫ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మేడ్చల్, శామీర్ పేట కు మెట్రో రైలు సేవలు పొడిగించడం పట్ల సీఎం కు ధన్యవాదాలు తెలియజేశారు. మెట్రో రైలు సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తుండడం వల్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

## జీవితంపై విరక్తితో విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్య

■ తుర్కపల్లిలో ఘటన

■ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న జీనోమ్ వ్యాలీ పోలీసులు

**జయభేరి, జనవరి 4:**

జీవితంపై విరక్తితో ఓ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ జిల్లా తుర్కపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. తుర్కపల్లి గ్రామానికి చెందిన నాగ వెంకట రమణ, లక్ష్మి దంపతుల కూతురు తేజస్విని స్థానిక విజేత టెక్నో స్కూల్ లో 10 వ తరగతి చదువుతుంది. కాగా తేజస్విని ఈ నెల 3 న తలనొప్పిగా ఉందని పాఠశాలకు వెళ్ళలేదు. రాత్రి అందరూ పడుకోగా అర్ధరాత్రి దాటిన తర్వాత బాత్ రూం తేజస్విని చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఉదయం 6.30 సమయంలో యువతి తల్లి లక్ష్మి నిద్రలేచి బాత్ రూమ్ కి వెళ్ళగా అక్కడ కూతురు విగతజీవిగా పడి ఉండడంతో బోరున విలపించారు. అయితే తేజస్విని నోట్ బుక్ లో ఓ సూసైడ్ నోట్ లభించింది. తనకు జీవితంపై విరక్తి కలిగింది. రోజు తినడం, పడుకోవడమే జరుగుతుంది. నాకు ఏమి రావా. నా జీవితం మొత్తం ఇలానే ఉంటుందా నాకంటూ ఎవరు లేరా అని నోట్ లో రాసి ఉంది. ఈ మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మానవ సేవే మాధవసేవ

■ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ లోని పార్వతినగర్ లో (మినీ ట్యాంక్ బండ్ ఎంట్రెన్స్ వే దగ్గర) వద్దేపల్లి వివేకమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను (బిపి షుగర్), డెంటల్, కంటి సమస్యలపైన వైద్య శిబిరం. విజయ నేత్రాలయ, రాఫా డయాగ్నస్టిక్ సెంటర్ యాజమాన్యం పాల్గొని సీనియర్ డాక్టర్ల బృందం చే మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొన్నారు. మానవ సేవే మాధవసేవ, సామాజిక సేవ చేయడం గొప్ప మానవత హృదయమని కొనియాడుతూ రాబోయే రోజులలో ఇలాంటి అనేక క్యాంపులు చేయాలని కోరుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అలుగు వెల్లి సుదర్శన్ రెడ్డి, ఎన్ ఎన్ కే దుర్గ, సేవాదళ్ అధ్యక్షులు కృష్ణ,కపిల్, రఫ్ ఆర్ డయాగ్నస్టిక్ సెంటర్ ఫౌండర్ పి వీరయ్య, ప్రైసైల్లా, కరుణాకర్ విజయ నేత్రాలయ డైరెక్టర్స్ ఎం మధుసూదన్ రెడ్డి, సుష్మా రెడ్డి, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## అరోరా లా కాలేజీ రెండో సంవత్సరం విద్యార్థి నాగిళ్ళ శంకర్ కు ప్రశంసా పత్రం

■ గర్వించదగ్గ విషయం అన్న ప్రిన్సిపల్ నక్క యాదగిరి

**జయభేరి, నల్లగొండ :**



నల్గొండ జిల్లా కేంద్రంలోని అరోరా లా కాలేజీలో లా మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతం పలుకుతూ నా రెండవ సంవత్సరం విద్యార్థులు పెట్టిన ప్రోగ్రాంలో సావిత్రి బాయి 149 జయంతి సందర్భంగా శుక్రవారం కాలేజీ ప్రిన్సిపల్ నక్క యాదగిరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పూలమాలలు వేసి కార్యక్రమా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ న్యాయ"దేవత"కండ్ల గంతలు కట్టి న్యాయం కోరుతున్నా అన్యాయపు సమాజాన్ని ఏమనాలి. సామాజిక అవగాహన పై స్పందిస్తూ సామాజిక కార్యకర్తగా అనేక అంశాలపై ఐదారి కలం ద్వారా రచనలు చేస్తూ అందులో భాగంగా న్యాయ"దేవత"కండ్ల గంతలు కట్టి న్యాయం కోరుతున్నా అన్యాయపు సమాజాన్ని ఏమనాలి. అనే అంశంపై వ్యాసం రాయడం ఎవరు కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ 2024లో ఈ యొక్క అంశంపై న్యాయ దేవతకు కండ్లకు గంతలు తీయాలని నిర్వహించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో గొప్ప అంశాన్ని జోడిస్తూ నాగిళ్ళ శంకర్ రాసినటువంటి ఈ ఆర్టికల్ కు రాష్ట్రంలోనూ దేశంలోనూ ఎవరు చేయనటువంటి ఆలోచన న్యాయ దేవతకు కండ్ల కుగందలు కట్టి న్యాయం కోరుతున్న సమాజం అంటూ రాసిన వ్యాసం గొప్ప విషయమని కొనియాడారు అదేవిధంగా దీనికి గాను కాలేజీ ప్రిన్సిపల్ ప్రశంసా పత్రాన్ని అందజేస్తూ సీనియర్ న్యాయవాది అధ్యాపకుడు కొండ యాదగిరి గౌడ్ చేతుల మీదు గా అందచేయడం జరిగింది. లీగల్ సామాజిక కార్యకర్త చండూరు మండల అడ్వైజర్ నారపాక అంజి కూడా ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. సన్మానంపై రచయిత ఐదారి శంకర్ మాట్లాడుతూ.. ఈ సమాజంలో మార్పు కోసం ఓ సహజమైన రచనను గొప్పగా చూడడం అనుకోకుండా ఈ న్యాయ దేవత కండ్ల కుగందలు తీయడం సమాజ మార్పులో భాగం నేను రాసిన రచన యాదృచ్ఛికంగా రావడం అదృష్టంగా భావిస్తూ కాలేజ్ యజమాన్యానికి ప్రిన్సిపల్ నక్క యాదగిరి సార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు శ్రీనివాస్ సార్ ధనలక్ష్మి వెంకట్ కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## హాస్టల్ లో దారుణ హత్య

**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి మల్లికార్జున నగర్ లోని అనురాగ్ రెడ్డి బాయ్స్ హాస్టల్లో దారుణ హత్య జరిగింది. అనురాగ్



రెడ్డి బాయ్స్ హాస్టల్లో మహేందర్ రెడ్డి(38) అనే క్యాబ్ డ్రైవర్ ను కిరణ్ రెడ్డి వంటలు చేసే గంటేలతో కొట్టి, కత్తితో పొడిచి హత్య చేసాడు. జనగాం చెందిన మహేందర్ రెడ్డి, గతంలో ఇదే హాస్టల్లో ఉండే వాడు. ప్రస్తుతం మహేందర్రెడ్డి హాస్టల్లో వుండడంలేదు. అప్పుడప్పుడు హాస్టల్ కి వచ్చి వెళ్తుంటాడని సమాచారం. అదే హాస్టల్ లో ఉండే మహేందర్ రెడ్డి స్నేహితుడు ఈ హత్య చేసినట్లు తెలుస్తుంది.



## శ్రీ విష్ణు శివాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- ఉత్సవాల ప్రచార రథాన్ని ప్రారంభించిన ఆలయ చైర్మన్ ఆదేపు ఉమా మహేశ్వరి

**జయభేరి, జనవరి 4:**

మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి లోని అతిపురాతనమైన శ్రీ అక్కన్న మాదన్న శ్రీ విష్ణు శివాలయం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాల ప్రచార రథాన్ని శనివారం ఆలయ చైర్మన్ ఆదేపు ఉమా మహేశ్వరి ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్దెమర్రి విష్ణు శివాలయంలో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి విశిష్టతను తెలుపుతూ ప్రచారం చేసేందుకు నూతన రథాన్ని ప్రారంభించనట్లు ఆమె తెలిపారు. ఈ వేడుకలకు రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల నుండే కాకుండా, జంట నగరాల నుంచి భక్తులు హాజరవుతారని, భక్తుల సౌకర్యార్థం ఆలయంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవం

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు



**జయభేరి, జనవరి 4 :**

జగన్ గూడ గ్రామంలోని బీరప్ప దేవస్థానంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. సిద్దేశ్వర్ గురుస్వామి, తాళ్ళ జగదీష్ గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పడి పూజ మహోత్సవం నిర్వహించగా ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తి గీతాలతో అయ్యప్పస్వామిని కొలుస్తూ ఆనందపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు

- అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పార్టీ సీనియర్ నాయకుడు తాళ్ళ జగదీష్ గౌడ్



**జయభేరి, జనవరి 4:**

మేడ్చల్ జిల్లా బిఆర్ ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలను జగన్ గూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు తాళ్ళ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో జగన్ గూడ లోని అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం, పండ్లు పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అనాథలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాళ్ల జగదీష్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా భవిష్యత్తులో వారు మరెన్నో పదవులు అందిపుచ్చుకుంటూ నాయకులకు కార్యకర్తలకు అండదండగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మన్మధ చారి, తాడెం స్వామి, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్స్ పర్ట్ గార్డింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరీనీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

- కొత్త సంవత్సరంలో నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచన



**జయభేరి, జనవరి 4:**

కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆకాంక్షించారు. మేడ్చల్ లో ఎక్స్ పర్ట్ గార్డింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరీ ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డినీ సంస్థ డైరెక్టర్ ప్రదీప్ సింగ్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ నూతన సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అనుకున్న కార్యాలు దిగ్విజయంగా కొనసాగాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు.

# హెల్మెట్ వినియోగం తప్పనిసరి చేస్తాం

- రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలి - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రమాదాల నివారణకు అవగహన కార్యక్రమాలు రూపొందించాలి
- రోడ్డు భద్రతా మాసోత్సవాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి



**జయభేరి, జనవరి 4:**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.శనివారం ఆయన హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. పిల్లల్లో రోడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా , మండల హెడ్ క్వార్టర్ లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. అదేవిధంగా ఆర్& బీ, పంచాయతీ రాజ్ శాఖ తమ పరిధిలో రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రోడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. భారీ తుఫాన్లు, వరదలు, వ్యాధుల వల్ల సంభవించే మరణాల కంటే రోడ్డు ప్రమాదాల వలనే అధికంగా ప్రాణాలు కోల్పోతున్నామని, ఈ ప్రమాదాల నియంత్రణకు అందరూ కలిసి పని చేయాలని అన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలను పిల్లల పాఠ్యాంశంలో కూడా పెట్టెలా చూస్తామని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో జారీ చేసేందుకు వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలకు విస్తృత ప్రచారం ఉండాలని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. మహిళల ప్రయాణికుల సంఖ్య పెరిగిన మార్గాలలో బస్సులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతా కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని, పాఠశాలలో రోడ్డు భద్రత ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఇక రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు మెస్ చార్జీలు పెంచామని, వారికి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పిల్లలకు అందించే ఆహార నాణ్యతను కలెక్టర్లు , ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని, ఆహార సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా చెల్లిస్తున్నామని, నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ ఉండవద్దని అన్నారు. అనంతరం రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ, జనవరి నెల మొత్తం రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరిగే రోడ్డు ప్రమాదాలలో 75% డ్రైవర్ తప్పుల వల్ల జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలు, పాటించాల్సిన నియమ నిబంధనల పై అవగాహన కల్పించాలని అన్నారు.రోడ్ల పై ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ ఏ ఆసుపత్రికి తీసుకుని రావాలి ఒక ప్రణాళిక ఉండాలని, దీనిపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి జిల్లా స్థాయిలో ఉన్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి పాఠశాల పరిసరాలలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై లోకల్ ఎఫ్.ఎం రేడియో, కేబుల్ చానల్స్ లో టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రోడ్లు, జాతీయ రహదారుల్లో అవసరమైన సైన్ బోర్డులు ఉండేలా జిల్లా రవాణా శాఖ అధికారి పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, రోడ్లు భవనాల శాఖఈఈ శ్రీనివాస్, రవాణా శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

- ఉపాధ్యాయ, దళిత ప్రజా సంఘాల డిమాండ్

**జయభేరి, గజ్వేల్, జనవరి 04 :**



దళిత ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చెసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఉపాధ్యాయ,దళిత ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం నాడు లకిడకపూల్ లోని శాంతి చక్ర ఆడిటోరియం లో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఎ)రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిహెచ్ఎం రాములు సార్ పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్య దర్శి చైతన్య డిమాండ్ చేశారు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాలు అన్ని ముక్తకంఠంగా ఈ దాడిని యావత్ తెలంగాణ ఉపాధ్యాయ సమాజం పై జరిగిన దాడిగా అభివర్ణించారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ఉండాలంటే వెంటనే ప్రభుత్వం స్పందించి దుండగులను శిక్షించాలని లేనిపక్షంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులంతా ఆందోళనలకు దిగుతారని తెలియజేశారు వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు విద్యార్థులకు తగిన నిబంధనలు ఈ అయ్యప్ప మాలల విషయంలో కొన్ని నియమ నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ దళితుడైన ప్రధానోపాధ్యాయులు రాములు పై పథకం ప్రకారం విహెచ్పి,భజరంగదళ్ దుండగుల దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. మతోన్మాదుల దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెంట అంజయ్య, దానయ్య,బిటిఎ ప్రధాన కార్యదర్శి మార్వాడి గంగ రాజు, గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు వెంకట్రాంరెడ్డి, మురళి కృష్ణ, మొహిద్దీన్,టిఎస్ టి యు అబ్దుల్లా, ఎస్.ఎల్ టిఎ నాయకులు గౌరీశంకర్, రాజకుమార్, యుటిఎ నాయకులు MD షాఖిల్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, పిఅర్ టియు నాయకులు మహేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిఎంఆర్ పాలిటెక్నిక్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్ డిమాండ్

**జయభేరి, గజ్వేల్, జనవరి 04 :**




గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఉన్న జిఎంఆర్ పాలిటెక్నిక్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు అనంతరం యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నాచారం శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో మెస్ బిల్లులు కట్టలేక హాస్టల్ విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు .

గతంలో రెసిడెన్షియల్ హాస్టల్ గా ఉండేది, దానిని స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ గా మార్చి విద్యార్థులే హాస్టల్ నడుపుకోవాలి ప్రతినెల బిల్లు కట్టుకోవాలి అని ప్రైవేటు హాస్టల్ మాదిరి గా జిఎంఆర్ పాలిటెక్నిక్ హాస్టల్ మారింది, దీని కారణంగా పేద మధ్యతరగతి విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్న హాస్టల్లో ఈ విధంగా మెస్ బిల్లులు కట్టుకోవడం అనేది తీవ్ర ఇబ్బందికి గురి చేస్తుందన్నారు, విద్యార్థులు మేము మిస్ బిల్లులు కట్టలేక పోతున్నాం అని విన్నవించుకుంటే, బిల్లు కట్టకపోతే హాస్టల్ కొనసాగదు దాని కారణంగా హాస్టల్ మూసి వేయాల్సి వస్తుందని ప్రభుత్వం హాస్టల్ ఇన్చార్జిలపై ఒత్తిడి తేవడంతో గత్యంతరం లేక హాస్టల్ ఇన్చార్జులు విద్యార్థులపై ఒత్తిడి తేవడం కొంతమంది విద్యార్థులు కళాశాలకు రావడం లేదు, కొంతమంది కట్టలేని స్థితిలో ఉన్నారు దీని కారణంగా నిత్యవసర సరుకు నెలలు తరబడి బిల్లులు కట్టలేక హాస్టల్ ఇన్చార్జిలకు హాస్టల్ కొనసాగించడం కష్టంగా మారిందన్నారు.

జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు అందరూ నాన్ లోకల్ వారు కావడంతో హాస్టల్ తప్పనిసరిగా ఉండాల్సి వస్తుంది, విద్యార్థులు అప్లికేషన్ చేసుకునేటప్పుడు జిఎంఆర్ పాలిటెక్నిక్ అని చూసే రెసిడెన్షియల్ హాస్టల్ ఉంటుందనే నమ్మకం తో విద్యార్థులు వస్తే వారికి మెస్ బిల్లులు కట్టాలి అని చెప్పడంతో చాలామంది కట్టలేని స్థితిలో ఉండడం జరుగుతుంది, దీని కారణంగా హాస్టల్ మూసివేయాల్సి వస్తుంది కాబట్టి ప్రభుత్వం ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ విడుదల చేసి మరియు ఈ హాస్టల్ని మళ్లీ రెసిడెన్షియల్ చేయాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రెసిడెన్షియల్ హాస్టల్ నుండి స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ గా మార్చింది, ప్రజా పాలన అని చెప్పుకునే ఈ ప్రభుత్వం స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ నీ రెసిడెన్షియల్ హాస్టల్ గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు, లేనియెడల విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ప్రవీణ్, రంజిత్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## బస్సు కొరకు ఇరువైపులా కంప చెట్లను తొలగింపు

**జయభేరి, చందంపేట :**

ముదుదండ్ల కు బస్సు రావడం లేదు అందుకుగాను చందంపేట నుండి ముదుదండ్ల కు వచ్చే దారి ఇరువైపులా కంపా చెట్లు పెరిగి దారికి అడ్డంగా ఉండడం వల్ల బస్సు రాలేక పోతుంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించు కోవడం లేదు. దేవరకొండ పట్టణానికి వెళ్ళడానికి చందంపేట కు వెళ్లి బస్సు ఎక్కి పోవడానికి ప్రజలు చాలా ఇబ్బంది కరంగా ఉంది. విషయం తెలుసుకున్న యాసని రాజవర్ధన్ రెడ్డి అనుకూలంగా స్పందిస్తూ వెంటనే (జేసీబీ) పెట్టి చెట్లను తొలగించడం కొరకు తన వంతు సహాయం చేసినారు. ఈ జెసిబి తో కంప చెట్లు తొలగించే కార్యక్రమంలో ఇప్ప గోపాల్ రెడ్డి, దామెర శ్రీను, నరందాసు మురళి, అన్నెపాక నిరంజన్,శ్రీను, కృష్ణరెడ్డి,ఇద్దమయ్య, రామలింగం, అనిల్, రామస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్యవర్గ సమావేశంలో పుట్టినరోజు వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం దేవరకొండ యూనిట్ నెల వారి కార్యవర్గం సమావేశం గంగిడి దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగినది. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నాలుగు కరువుబత్యం బకాయిలు, పి. ర్. సి వెంటనే మంజూరు చేయాలని, హెల్త్ కార్డుపై అన్ని కార్పొరేట్ వైద్యాశాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరినారు, కార్యదర్శి అంకం చంద్రమౌళి మాట్లాడుతూ ఫిబ్రవరి మాసం చివరి వరకు అందరు పెన్సనర్లు లైఫ్ సర్టిఫికెట్స్ కొరకు మన సేవాసదనంనకు ఆధార్ కార్డు, ఐడెంటిటీ కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఒక పాసుపోర్టు సైజు ఫోటో,సెల్ ఫోన్ తీసుకొని రావాలి అన్నారు. అనంతరం కోశాధికారి పంగునూరు లింగయ్య ఆర్థిక నివేదిక సమర్పించిన ఆమోదం పొందినారు. అనంతరం ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ 75వ పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగినది. శాలువతో సత్కరించడం జరిగినది. వారు సంతోషం వ్యక్తం చేసినారు. హాజరైన సభ్యులందరికి ఐజాక్ భోజనాలు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు, సభ్యులు తదితరులు పాలుగొన్నారు.

# బీసీల రిజర్వేషన్ గురించి మాట్లాడే హక్కు కవితకు లేదు

- బీసీల అభివృద్ధికి పాటుపడేది కాంగ్రెస్
- సీనియర్ నాయకులు నల్లగోని బాలకిషన్ గౌడ్



**జయభేరి, బచ్చన్నపేట, జనవరి 4 :**

మండల కేంద్రంలో బీసీల ఐక్యతా సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్లగోని బాలకిషన్ గౌడ్ సమావేశం అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని,తన తండ్రి ఎత్తి వేసిన ధర్నా చౌక్ లో ధర్నా చేయడం ఇంకా ఆస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. క్రితంలో బీసీలకు 34 శాతంగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలలో గత ప్రభుత్వం 11% శాతం తగ్గించి 23% గా నిర్వహించినప్పుడు ఎమ్మెల్సీ కవిత ఎక్కడున్నారని అప్పుడు ఎందుకు అడగలేదని ఎద్దేవా చేశారు.1953లో అప్పటి ప్రధాని నెహ్రూ బీసీలపై అధ్యయనం చేయడానికి కాకా కాలేల్కర్ కమిషన్ వేశారు అని గుర్తు చేశారు.బీసీల అభ్యున్నతికి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పాటుపడేది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. గత 10సం"ల కాలంలో చేయలేని బీసీల అభివృద్ధి, ప్రజలు చీకొట్టి అధికారం నుంచి తొలగించినా కూడా టిఆర్ఎస్ కు బుద్ధి రాలేదని, స్థానిక సంస్థల్లో బీసీలకు అభివృద్ధికి బీసీ అభ్యర్థులకు తోడ్పాటు అందించాలని కార్యకర్తలను ప్రజలను కోరారు.టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండి మాసూద్, వెంకట్ గౌడ్ దాచేపల్లి నర్సింగరావు, నిడిగొండ శ్రీనివాస్, గాలి కృష్ణ దాచేపల్లి రాజయ్య, దేవరకొండ రమేష్, సూత్రామె రామకృష్ణ,రాగిర్ సత్యనారాయణ, గోలి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



## రవాణా రంగ డ్రైవర్లు,కార్మికుల జిల్లా సదస్సును జయప్రదం చేయండి

**జయభేరి, పరవాడ:**

దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్డు రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందని ఈ రంగంలో పనిచేసే ఆటో, మోటర్, బస్, లారీ, వ్యాన్లు ద్వారా ప్రయాణికులను సరుకులను చేరవేస్తున్నారని వీరి సమస్యలు పరిష్కారానికి జనవరి 5న అనకాపల్లిలో జిల్లా సదస్సు జరుగుతుందని ఈ సదస్సుకి ముఖ్యఅతిథిగా అఖిల భారత రోడ్ టాన్స్ పోర్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య రాష్ట్ర నాయకులు ఈ సదస్సులో పాల్గొని మాట్లాడతారని ఈ సదస్సుని డ్రైవర్లు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు.సదస్సు కరపత్రాన్ని శనివారం పరవాడ మండలం వాడ చీపురుపల్లి ఆటో స్టాండ్ ఆటో వద్ద ఆటో యూనియన్ నాయకులతో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వాడ చీపురుపల్లి ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## భట్టి పర్యటనను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే రేవూరి

**జయభేరి, పరకాల, జనవరి 04:**

మొగిలి చర్ల గ్రామంలో ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటను విజయవంతం చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం గీసుకొండ మండలం మొగిలిచర్ల గ్రామంలో సబ్ స్టేషన్ శంఖు స్థాపనకు స్థలం, మీటింగ్ ఏర్పాట్ల పనులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మొగిలిచెర్ల గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ కి శంఖు స్థాపన చేయనున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పార్కింగ్ స్థలాన్ని, సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పరకాల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

## లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

**జయభేరి, పరవాడ:**



ఆంధ్ర రాష్ట్ర, విశాఖ జిల్లా అందుల సమాఖ్య వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మరిడి మాంబ కల్యాణ మండపంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి హాజరైన ముఖ్యులు మాట్లాడుతూ.. దివ్యంగులకు ఆదర్శంగా లూయిస్ బ్రెయిలీ నిలిచారని ఆరుచుక్కలతో అందులకు జీవితాలలో వెలుగును ఇచ్చారని తెలియజేస్తూ దివ్యంగుల కొరకు శాశ్వత బిల్డింగ్ నిర్మించడం జరుగుతుందని తెలియజేసారు. దివ్యంగులకు ప్రభుత్వాలు అనేక రిజర్వేషన్ లను కల్పిస్తుందని వాటిని ఉపయోగించుకోవాలని తెలియజేసారు. రిజర్వేషన్ లను కల్పిస్తుందని వాటిని ఉపయోగించుకోవాలని తెలియజేసారు. లూయిస్ బ్రెయిలీ జయంతోత్సవం జరుపుకోవడం ఆనందకరమైనది అని అలాగే దివ్యంగుల కొరకు శాశ్వత బిల్డింగ్ కొరకు మండల నిధుల నుండి సహకరిస్తామని దివ్యంగుల కొరకు అన్నివేళలా సహకరిస్తామని తెలియజేసారు .లూయిస్ బ్రెయిలీ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని దివ్యంగులెవరు తక్కువ కారని ప్రస్తుతము అన్ని రంగాల్లో ముందున్నారని తెలియ జేస్తు దివ్యంగుల బిల్డింగ్ కొరకు అధికారులను నాయకులను సమన్వయము చేసి బిల్డింగ్ నిర్మాణం అయ్యేటట్లు కృషిచేస్తామని తెలియ జేశారు అలాగే ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అందుల ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ .అర్జున్ రావు మాట్లాడుతూ గత 30 సంత్సరాలుగా దివ్యంగుల హక్కుల కోసం పోరాడుతున్నామని ఇందులో భాగంగా దివ్యంగుల కొరకు శాశ్వత బిల్డింగ్ నిర్మాణం కొరకు కార్య క్రమానికి విచ్చేసిన వారు అందరు సహకరించాలని కోరడమైనది. రాష్ట్ర నలుమూలల నుండి విచ్చేసిన సుమారు 400 మంది దివ్యంగులైన బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా ఫెడరేషన్ అధ్యక్షులు అర్జున రావు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర రావుకు ఘనంగా సన్మానం చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ మండల ఇంచార్జి పంచకర్ల ప్రసాద్, జెడ్ పీ టీసీ సభ్యులు పైలా సన్యాసి రాజు, స్థానిక సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు, ఎంపీటీసీ పయిల శ్రీనివాస్, సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, వెన్నల సన్యాసిరావు, వీరు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



**జయభేరి, పరవాడ:**

పరవాడ భవిత కేంద్రం నందు ప్రపంచ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా అందుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్ అర్జున్ రావు విచ్చేసి లూయిస్ బ్రెయిలీ యొక్క చరిత్రను వివరించారు. మండల విద్యాశాఖ అధికారి 2 సాయి శైలజ మాట్లాడుతూ సమగ్ర శిక్ష వారు అందిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెలువెల్లి ఫౌండేషన్ వారు దివ్యాంగులకు స్టేషనరీ ఐటమ్స్ అందజేయడం జరిగింది. భవిత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, దివ్యాంగులు లూయిస్ బ్రెయిలీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లల తో సరదాగా గడిపారు తదానంతరం భవిత కేంద్రంలో టి. భాస్కర్ రావు దంపతులు భోజన సదుపాయం ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో అంధుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్ అర్జున్ రావు, వెలువల్లి ఫౌండేషన్ ఫౌండర్ రవి రాజు, ట్రెజరర్ రవికుమార్, వెలువల్లి మీడియేటర్, వెలువల్లి జనసన్ కుటుంబ సభ్యులు, దివ్యాంగులు వారి తల్లిదండ్రులు, భవిత ఉపాధ్యాయులు కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- టీఎన్జీవో అధ్యక్షురాలు రుణాదేవి



**జయభేరి, దేవరకొండ :**

కొత్త ఏడాది కొత్త ఆశలు కొత్త కోరికలు కొత్త లక్ష్యాలు కొత్త ఆశయాలు కొత్త నిర్ణయాలు కొత్త వేడుకలు కొత్త ఉత్సాహం తో ప్రతి ఒక్కరూ మంచి సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలని దేవరకొండ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) అధ్యక్షురాలు దాసరి రుణాదేవి పేర్కొన్నారు. శనివారం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు కార్యదర్శి ఎస్ మధు, ట్రెజరర్ ఎస్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలు

- లూయిస్ బ్రెయిలీ జీవితం అందరికి ఆదర్శప్రాయం : స్వర్ణలత

**జయభేరి, జనవరి 4 :**




లూయిస్ బ్రెయిలీ జీవితం అందరికి ఆదర్శ ప్రాయం అని మేడ్చల్ జిల్లా దివ్యాంగుల శాఖ అధికారిని స్వర్ణలత అన్నారు. శనివారం డాక్టర్ లూయిస్ బ్రెయిల్ జయంతి ఉత్సవాలను శామీర్ పేట మండల పరిషత్ భవనంలో జిల్లా దివ్యాంగుల శాఖ, లూయిస్ బ్రెయిలీ సెలబ్రేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రసంగించారు.లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం విశేషంగా కృషి చేశారనీ గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు ఆయన మార్గంలో నడవాలని భవిష్యత్తులో అంతటి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అందుల పట్ల సమాజం జాలి చూపడమే కాక వీలైతే చేయూత అందించాలని కోరారు. ఇక విద్యార్థులను ఉద్దేశిస్తూ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులు ఉంటే వారికి చేతనైన సహాయం చేయాలే కానీ వారిని కించపరిచేలా మాట్లాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయ కుమారి, మండల విద్యాధికారిని వసంత కుమారి, ఎస్ ఐ పరశురాం నాయక్, లూయిస్ బిల్ కమిటీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఏం శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి బి మురళి, ట్రెజర్ జి మహేష్, ఆర్గానిక్ సెక్రెటరీ శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసిఐఎల్ లో ట్రాఫిక్ పోలీసుల అవగాహన

- సీటు బెల్టు, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగహన కల్పించిన ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ రామలక్ష్మణ రాజు



**జయభేరి, జనవరి 4:**

మేడ్చల్ జిల్లా కుషాయిగూడ, ఈసీఐల్ ప్రధాన కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగహన కల్పించారు. వాహన దారులకు సీటు బెల్టు పెట్టుకోకపోవడం వలన కలిగే అనర్థాలు గురించి కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎన్ రామలక్ష్మణ రాజు వాహనదారులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర డిజిపి జితేందర్, రాచకొండ సిపి సుధీర్ బాబు ఆదేశాల మేరకు వాహనదారులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ తో పాటు పక్కన ఉన్న వ్యక్తులు కూడా తప్పని సరిగా సీటు బెల్టు ధరించాలని, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం లేకుండా కాపాడుతాయని తెలిపారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు శుభాకాంక్షలు

- మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్




**జయభేరి, దేవరకొండ :**

కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో నూతన సంవత్సరం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రివర్యులు గుంటకుండ్ల జగదీశ్వర్ రెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపిన నల్గొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఎంఎస్ ఫన్ పేర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని,ఆనందాన్ని కలిగించేందుకు శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వాహకులు ఎంఎస్ ఫన్ పేర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్లు చూడటం వల్ల చిన్న పిల్లల్లో మానసిక వికాసం జరిగి పరిపక్వం పొందుతారని పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ.. నిత్యం బిజీ బిజీగా గడిపే దేవరకొండ పట్టణ,పరిసర ప్రాంత వాసుల కోసం, చిన్నారులకు పెద్దలకు కుటుంబ సమేతంగా ఈ ఎగ్జిబిషన్ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇస్తుందని అన్నారు. సినిమాలలో సెట్టింగ్ల మాదిరిగా స్వాగతం పలికే విధంగా రోబోటిక్ ఏనిమల్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఎగ్జిబిషన్ మొక్క ద్వారాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. ఎగ్జిబిషన్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అనేక వస్తువులు అమ్మకానికి ఉంచామని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా ఆనందాన్ని కలిగించే జాయింట్ వీల్, బ్రేక్ డాన్స్, జంబో జెట్, డ్రాగన్ ట్రైన్, వాటర్ బోర్డ్,రేసింగ్ కార్, ధూమ్ బైక్, చిన్నపిల్లల కొరకు అనేక ఆట వస్తువులతో ఏర్పాటు చేశారని అన్నారు. చాట్ బండార్, ఐస్ క్రీమ్, పలు రకాల స్నాక్స్ సరాసమైనా ధరలకు లభిస్తాయని పేర్కొన్నారు. సందర్శకుల కోసం కట్టుదిట్టమైన చర్యలు భద్రత ఏర్పాటు చేశామని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాజీ మంత్రి కేటీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**జయభేరి, దేవరకొండ :**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ .

## విద్యార్థుల నడుమ కేఆర్ దిలీప్ రాజ్ జన్మదిన వేడుకలు

- జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష పాడ్ లను అందజేత



**జయభేరి, హన్మకొండ, జనవరి 04:**

శుక్రవారం వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ జన్మదినం సందర్భంగా హసన్ పర్తి మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారు 1000 మంది విద్యార్థులకు పరీక్ష పాడ్ లను బహుకరించారు. అనంతరం విద్యార్థుల నడుమ కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించిన వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన గడ్డం వరుణ్. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ దిలీప్ జన్మదినాన్ని పురస్కరించుకొని వృధా ఖర్చులు చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే పరీక్ష పాడ్ లను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, సీనియర్ నాయకులు రాయికంఠి సుధాకర్, యుగంధర్, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల పవన్ కళ్యాణ్, హసన్ పర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వీర సుధాకర్, ఎర్రగట్టుగుట్ట దేవస్థాన పాలక మండలి సభ్యులు చల్లా సుమంత్, యూత్ నాయకులు నాగరాజు, మురళీ, రాజేష్, వంశీ, హరీష్, చింటూ, ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.




## ఆసుపత్రిలో చేరిన
# కియారా అద్వానీ..?

బాలీవుడ్ నటి కియారా అద్వానీ అనారోగ్యం కారణంగా ముంబైలోని ఆసుపత్రిలో చేరినట్లు ఉదయం నుంచి వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను ఆమె ప్రతినిధి ఖండించారు. కియారా అద్వానీ ఏ ఆసుపత్రిలో చేరలేదని.. ఆమె ఆరోగ్యంగానే ఉందని బిజీ షెడ్యూల్ కారణంగా విశ్రాంతి తీసుకోవాలని అనుకుందని అంతే తప్ప సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు ఫేక్ అని తెలిపారు. కియారా అద్వానీ నటిస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. రామ్ చరణ్ కథానాయకుడిగా.. నటిస్తున్న ఈ సినిమాకు శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. దాదాపు 3 ఏండ్లకు పైగా షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది కియారా. రీసెంట్‌గా ఆరోగ్యం బాలేక గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఈవెంట్‌కి కూడా రాలేదు ఈ అమ్మడు. ముంబై ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న ఈ అమ్మడు ప్రస్తుతం విశ్రాంతి తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, నాజర్, ప్రకాష్ రాజ్, సునీల్, జయరామ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





## జానర్ అడక్కండి..

విశ్వదేవ్ రాచకొండ, బిందుమాధవి ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కుతున్నది. స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశాంక్ శ్రీవాస్తవయ దర్శకుడు. రానా దగ్గుబాటి సమర్పణలో రూపొందుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి ఈ లుక్‌లో అల్ట్రా మోడరన్‌గా ఆకట్టుకున్నారు. పోస్టర్‌పై 'జానర్ అడగొద్దు.. మాక్కూడా తెలీదు' అనే క్యాప్షన్ కథపై ఆసక్తిని పెంచుతున్నది. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్, సౌండ్ మిక్స్: అజిత్ అబ్రహం జార్జ్.

# నమో నమః శివాయ

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' చిత్రం నుంచి శివుడి నేపథ్యంలో భక్తి ప్రధానంగా తెరకెక్కించిన 'నమో నమః శివాయ' పాటను శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరి 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. 'నమో నమః శివాయ' పాటకు దేవిశ్రీప్రసాద్ స్వరాల్ని సమకూర్చగా, జొన్నవిత్తుల సాహిత్యాన్ని అందించారు. అనురాగ్ కులకర్ణి, హరిప్రియ ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతుల్ని అందించారు. కళాత్మక, ఆధ్యాత్మికత కలబోతగా మహా శివుడి నామస్మరణతో ఈ పాట భక్తి భావాలను మేల్కొలిపే విధంగా సాగింది. నాగచైతన్య, సాయిపల్లవి చక్కటి నృత్యాలతో మెస్మరైజ్ చేశారు. సర్వశక్తివంతుడైన శివుడి ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాటను తెరకెక్కించామని, సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. మత్స్యకారుల జీవితం నేపథ్యంలో ప్రేమ, దేశభక్తి ప్రధానాంశాలుగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: గీతా ఆర్ట్స్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, రచనదర్శకత్వం: చందూ మొండేటి.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com